# మార్గదర్శి

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు

"పంతులూ, ఇక నువ్వు వెయ్యిచెప్పు, లక్ష చెప్పు. నౌకరీకోసం సిఫార్సన్నమాట నాదగ్గిర యెత్తకు. సబుజడ్జీగారు మావియ్యంకులు కనక నామాట కొట్టెయ్యక పోవడం నిజమే. కాని నేను వ్రతం పట్టాను. ఇదివరకి సన్నిందుకోసం చాలామంది ఆశ్రయించారు. అందరికీ యీమాటే చెప్పాను. వారి నందర్నీ "నావల్ల కా"దని చెప్పి పొమ్మన్నాను; కాని నిన్ను పొమ్మనను. వెడితేను నీపనికోసం మరివకళ్ల నాశ్రయిస్తావు. ఈపట్టు పట్టు చివరికి స్కూలు మేష్టరీ అయినా, సంపాదిస్తే గాని నువ్వు తృప్తిపడవు. నువ్వు నౌకరీ చెయ్యడం నాకు సుతరామూ యిష్టం లేదు."

"విన్నావా? నీకేం లోటూ? కాలవకింద రెండున్నర యెకరాల భూమి వుందని చెపుతున్నావు నీకు. ఇంకేమీ? పొదుపుగా వాడుకుంటే— వేషాలు వెయ్యకపోతే సుడ్డిగవ్వయినా సంపాదించకపోయినా నీ తరం గడిచిపోతుంది. అంటే యీవేళే నువ్వు దిగాలుపడి కాళ్లు విరగతొక్కుకోవలసిన పని లేదు. నిదానంగా చూసుకోవచ్చు. ఇరవై రెండేళ్లే కామా నీ వయస్సూ? ఏమీ ఆధారం లేనివాడిలాగ కంగారుపడి నిక్షేపంలాంటి జీవితాన్ని వకళ్లకమ్ముకోవలసిన యోగం లేదు. నీకు."

"స్కూలు ఫైనలులో పరీక్ష యిచ్చావు. నవయౌవనంలో ప్రవేశించావు. చేతిలో పని వుంది. నోట్లో వాక్కుంది. నీ కళ్లల్లో చక్కని తేజస్సు వుంది. తరతరాలనుంచి సంచితమైన బ్రాహ్మణ్యప్రతిభ నీలో తక్కువగా లేదు. కాని ఆత్మజ్ఞానం వున్నట్లు లేదు. ఆత్మగౌరవమూ, ఆత్మశక్తీ తెలిసినట్లు లేదు. నీకే కాదు బ్రాహ్మణసంఘాని కంతా యిప్పుడిదే లోటు. సబుకోర్టులో యిరవై రూపాయలకి నౌకరీ చెయ్యడానికి సిద్ధపడుతున్నావు నువ్వు. అంటే యేమిటో తెలుసునా? వొళ్లు వంచి— చెమట వోడ్చి పని చేస్తానన్నమాట. శ్రమ పడడానికి తయారుగా వున్నా నన్నమాట."

"బాడిత చేత పుచ్చుకుని కర్రలు చెక్కుతాడు వడ్రంగి. సమ్మెట యెత్తి యినుము సాగకొడతాడు కమ్మరి. మట్టి పిసికి కుండలు చేస్తాడు కుమ్మరి. నూలు వొడికి బట్టలు నేస్తాడు దేవాంగి. కలం పుచ్చుకొని లెక్కలు రాస్తాడు గుమాస్తా. అంతా శ్రమే. రకంలో తప్ప రాశిలో భేదం లేదు. కాని తక్కినవా రంతా స్వతంత్రులు. గుమాస్తా అస్వతంత్రుడు. ఇదీ భేదం. అయితే పని చెయ్యడానికి ఆక్షేపణా, బద్ధకమూ లేనప్పుడు భుక్తికి లోటు లేని నువ్వు యితర్లకి సేవ చెయ్యడం యెందుకు చెప్పూ! పూటకి టికాణాలేనివాడూ, ఆకస్మికంగా సంసారం మీదపడ్డవాడూ, స్వతంత్రంగా కల్పన చెయ్యలేనివాడూ నౌకరీకి పోవడం బాగానే వుంది. కాని కల్పనాశక్తి వున్నవాడు ఆశక్తిని యితర్లకి ధారపొయ్యడానికి బదులు తనకే యెందు కుపయోగించుకోరాదూ? ఇదీ నే నడిగే మాట."

"పద్ధెనిమిదో యేట యీసమస్య నన్నడ్డుకుంది. అప్పటి స్థితి తలుచుకుంటే యిప్పుడు కూడా శరీరం గజగజలాడిపోతుంది నాకు. ఈశ్వరానుగ్రహంచేత నే నెలాంటి దౌర్భాగ్యదశని దాటానో నువ్వెరగవు. దారిద్ర్యం యెలాంటిదో నీకేం తెలుసును? నరకబాధలలో కూడా అంత తీవ్రమైన దుండదు. శ్రీహరీ, లోకంలో యెంతమంది దాని ఆక్రమణలో పడి బాధపడుతున్నారో? ఎదిరించి నిలవగల శక్తి వుండిన్నీ యెందరు దానికి లొంగిపోతున్నారో?"

"సెంటు భూమి లేదు. చేతిలో రాగిదమ్మిడీ లేదు. సంపాదన లేదు. ఇంకా ఆవృష్టికూడా లేదు. అప్పుడే పదిహేడో యేడు వెళ్లింది. బడికి పోవడమూ,

ఆట లాడడమూ తప్ప వేరే ధ్యానమే లేదు. అలాంటి సమయంలో సన్నిపాతజ్వరం వచ్చి మానాయన కాలం చేశాడు. ఆరోజు లెలా గడిచిపోయాయో నాకు తెలవదు. ఎవళ్ల యింటికి వాళ్లు వెళ్లిపోయారు. ఇక మా అమ్మా, నేనూ వున్నాం. అమ్మ అంటే పార్వతీదేవి అనుకోవేం. మాఅమ్మలాంటి అమ్మ యెవళ్లకీ వుండదు. ఇదంతా ఆవిడ చలవే. ఈసంపత్తంతా ఆవిడ దీవనవల్ల కలిగిందే."

"నాయనా! పది కుంచాల బియ్యమూ, రస వర్గాలూ వున్నాయి. నెలరోజులు గడిచిపోతాయి. తరవాత యెలా కాలం గడుస్తుందీ? ఏమాలోచించావూ?" అంది మాఅమ్మ. "తండ్రీ! బెంబేలుపడకు. నారు పోసిన యీశ్వరుడు నీరు పొయ్యకమానడు. నువ్వేతపోభంగం వల్లనో నాకడుపున పుట్టావు. నీనొసట కష్టం రాసి వుంది. కాని మనస్సు పాడుచేసుకోకు; ఆలోచించు." అంది.

"వక్కమాటు ప్రపంచకం అంతా గిర్రున తిరిగిపోయినట్లయింది నాకు. విచారంఅంటే యేమిటో యెరగని స్థితిలో యెర్రని యేగాని లేని సంసారం హఠాత్తుగా మీద పడింది. అయితే అది యెంతదైనా లెక్కచెయ్యకుండా మోసేవాడూ మనిషే. దిగ్భ్రాంతుడై దానికింద పడి అణగారిపోయేవాడూ మనిషే. నిజంగా "మనం పెట్టి పుట్టామా లేదా?" అని కాదు ఆలోచించుకోవలసింది. "మనకి మగతనం వుందా లేదా?" అని చూసుకోవాలి. నల్లరాతిని చూస్తే "దీన్ని కదపగలమా?" అని భయం వేస్తుంది. సాగతీసి దానొక్క తన్ను తన్నితే కాలు విరిగి పిప్పయిపోతుంది. కాని అలా కాకుండా వోపిక పట్టి దానిమీదనుంచి నడుస్తూవుంటే పిప్పయిపోయే యీకాలికిందే పడి అది అరిగిపోతుంది."

"వాస్తవంగా సంసారం సంగతి కూడా అంతే. రెండు కళ్లతోటీ చూస్తే అది స్వాధీనంలో వుంటుంది. కళ్లు మూసుకుంటే అది వూబిలో తొక్కేస్తుంది. నేను బడాయి చెప్పుకోవడం కాదు. ఆనిరాధారస్థితిలో కూడా నాకు భయం కలగలేదు. నిలవ చేస్తామా లేదా అంటే అది వేరే సంగతి. ముందు కాలం గడిపివెయ్యడం చేతనైతే అంతా మన చేతిలో వుందన్నమాటే. రోజులు గడచిపోవడాని కనేకమార్గాలున్నాయి. లోకంలో మనుష్యులకంటే సంసారం నిర్వహించుకోతగ్గ మార్గాలధికంగా వున్నాయి. నిదానిస్తే స్వతంత్రమార్గం దొరుకుతుంది. గగ్గోలుపడితే మాత్రం చెడతాడు."

## ౨

"మాఅమ్మ అలా చెప్పి నాకు చద్దన్నం పెట్టేసి యింటిపనిలో ప్రవేశించింది. నేను వీధి అరుగుమీద కూచుని ఆలోచనలో పడ్డాను. అప్పటికి లోవరు సెకండరీ చదువుతున్నాను. సంసారం మీద పడ్డాక యిక చదు వేమిటి? మానాన్న మొదటే శ్రద్ధ చేస్తే అప్పటికి మిటిక్యులేష నేనా అయిపోవును. కాని నాకు పద్నాలుగో యేడు వచ్చేదాకా మానాన్న మహేంద్రవాడ విడిచిపెట్టలేదు. అప్పుడేనా 'అబ్బాయి బాగుపడే మార్గం చూడరూ?' అంటూ మాఅమ్మ పోరగా పోరగా రాజమహేంద్రవరం ప్రవేశించాడు. మానాన్న అక్కడా యిక్కడా కూడా తంబురా పుచ్చుకుని తిరగడమే; కాని రాజమహేంద్రవరం ప్రవేశిస్తే నా కంతకంటే మంచిమార్గం దొరుకుతుం దని మాఅమ్మ వుద్దేశం. దొరికేటట్లు చెయ్యాలి అని పట్టుదల కూడానూ. నిజంగా మా అమ్మే నన్ను బాగుచేసింది; నాజీవితాని కావిడే మంచి పునాది వేసింది. ఇప్పటికి కూడా మాఅమ్మ జ్ఞాపకం— చూడూ నా వొళ్లంతా యెలా గరిపొడిచిందోనూ! రక్త గబగబ ప్రవహిస్తుంది. 'నాయనా! వూరికే కూచున్నావా?' అని నన్నడిగినట్లవుతుంది."

"విన్నావా?' మాఅమ్మ ఆత్మే యీరువై యేళ్ల వయస్సులో కూడా నన్ను నడిపిస్తోంది. నేనీ సంపత్తు సంపాదించడంలో నాగొప్ప యేమీ లేదు. ఆవిడ కడుపున పుట్టడమే గొప్ప తపఃఫలం. అలాంటి తల్లి ఉన్నవాడికిక లోటేమిటి నాయనా?"

"వక్క గంట ఆలోచించాటప్పటికి నాహృదయంలో యేదో మెరుపు మెరిసిన ట్లయింది. నిదానించగా వక పూర్వపు సంగతి జ్ఞాపకం వచ్చింది."

"మహా మంచి సంగతి. అదే నన్నీ స్థితికి తెచ్చింది. సెబాస్! నాజీవితాకాశంమీద అది ధృవతార లాగ యెప్పుడూ మెరుస్తూ వుంటుంది."

"ఫాల్గుణపున్నానికి మహేంద్రవాడలో అమ్మవారి తీర్థం జరుగుతుంది. మాయింటి పక్కని వక బీద కోమటి వుండేవాడు. చిల్లరదుకాణంమీద కూచుని వూరు నిలుపుతూ వుండేవాడతను. అతనికి నాయీడువాడే వకకొడు కుండేవాడు. అప్పటికి నాకు పదకొండో యేడు. మేమిద్దరమూ మూడో క్లాసు చదివి వక్కమాటే బడి మానేశాం. నేను మూడుపూట్లా భోజనం చేసి తిరిగేవాణ్ణి. అతను వ్యాపారంలో తండ్రి కాసరా అవుతూ వుండేవాడు."

"ఆరేటి తీర్థంనాడు మాఅమ్మ నాకు రెండణా లిచ్చింది. అతను పొద్దున్న మొదలు మధ్యాహ్నందాకా తండ్రితో పోరి వక అణా తెచ్చుకున్నాడు. 'వోస్, ఇంతేనా?' అన్నాను నేను. అతనికంటే నేను గొప్పవాణ్ణని నాకు గర్వం కలిగింది. ఆరెండణాలతోటే నాలు గైదురకాల పిండివంటలు కొని తినవచ్చునుకదా అని పొంగిపోయాను నేను. కాని నేనెంత యీసడించినా అత నా అణాకే సంతోషించాడు. 'రా తీర్థంలోకి' అని నేను ముందడుగు వేశాను కాని అతను 'తొందరపడ' కన్నాడు. అప్పటి కింకా జామున్నర పొద్దుంది. ఇంకో గంటకి గాని తీర్థం పూనుకోదు. అయితే 'రెండణాలూ యెప్పుడు ఖర్చుపెట్టేస్తానా?' అనే వుబలాటంలో నాకేమీ తెలవడం లేదు. మనస్సు వురకలు వేసేస్తోంది."

"నేను మళ్లీ తొందరపెట్టగా 'దుకాణాలు సద్దకుండా వెళ్లి యేం చేస్తావయ్యా?' అన్నాడతను. అబ్బాయీ, చెప్పవద్దూ? నా కప్పుడు ఆకోమటిబిడ్డ మీదా, దుకాణాలవాళ్ళమీదా కూడా చాలా కోపం వచ్చింది. 'నువ్వు రాకపోతే నేను వెళ్లలే ననుకున్నావా యేమి?' టని అందా మనుకున్నాను. 'రెండణాలు ఖర్చుపెట్టెయ్యడానికి నేను సిద్ధంగా వుండగా యింకా నుంచోమంటా డేమి టితను?' అనిపించింది. 'వద్దన్నం తిన్నది మొదలు పోరితే గాని చేతిలో పడని యీఅణాని యితను సాయంత్రందాకా ఖర్చుపెట్టడు కాబోలురా' అనుకుంటూ, అయినా యేం చేస్తాడో చూద్దామని తొందర అణుచుకొని ఆగిపోయాను."

"నన్నిక్కడే నుంచోపెట్టి వక్కకానికి తమలపాకులు కొనుకువచ్చాడతను. తక్కిన ముక్కానికి పోకచెక్కలూ, లవంగాలూ, యాలక్కాయలూ, దాల్చినీ,—యిలాంటి చిల్లరసామాను తండ్రిదగ్గరే పుచ్చుకొని ఆకులికి సున్నం రాసి యెనిమిది కిల్లీలు కట్టి 'మరి పదవయ్యా,' అని నన్ను రమ్మని 'కిల్లీలు కిల్లీ' లంటూ బయలుదేరాడు. అప్పటి కప్పుడే తెల్లని బనియన్ల మీద నల్లని వుల్లిపొర చొక్కాలు తొడుక్కుని తీర్థంలో యిలాగా అలాగా తిరుగుతూ రైతుల కుర్రాళ్లు అప్పడాలు కరకర లాడిస్తున్నారు. కోమటిబిడ్డ వాళ్ల మధ్యకి వెళ్లేటప్పటి కెనిమిది కిల్లీలూ యెగిరిపోయి పళ్లెంలో ఘల్లు మని యెనిమిది డబ్బులు పడ్డాయి."

"అది చూశాటప్పటికి నావొళ్లు గరిపొడిచింది. నాలుగు డబ్బుల్లో నుంచి యింకో నాలుగు డబ్బులు పుట్టించాడతను. కాని కష్టపడితేగాని అతనికి రెండో అణా రాలే దనీ, నాకు చులాగ్గా మొదటే వచ్చిం దనీ నాకు గర్వం కలిగింది. పిండివంటలు కొని తినెయ్యాలన్న తొందర యింకా తగ్గలేదు. 'మరి రా' అన్నాను; కాని లాభం తిన్న కోమటిబిడ్డ అంతట్లో వస్తాడూ? 'నీకు తొందరగావుంటే నువ్వు పో' అని అతను మళ్లీ వూళ్లోకి మళ్ళాడు. వక మూల అప్పుడే తయారవుతూ వున్న వేడివేడి పకోడీలు 'ఈపాటికి దయచెయ్యవోయి' అని నన్ను పూరిస్తూనేవున్నా, అత నింకా యేంచేస్తాడో చూద్దామని వెంట బయలుదేరాను."

"అత నీమాటు అర్థణా తమలపాకులూ ఆరుకానుల చిల్లర సామానూ పుచ్చుకొని పదహారు కిల్లీలు కట్టి మళ్లీ తీర్థంలో పడ్డాడు. అరగంట తిరిగేటప్పటికి కవి అయిపోయాయి. మళ్లీ కట్టి మళ్లీ అమ్మాడు. ఇలాగ నాలుగైదుమాట్లమ్మాడు. అంతవరకూ మొగం వేలవేసుకుని నేనతని కూడానే తిరిగాను; గాని నారెం

డణాలూ మాత్రం ఖర్చు పెట్టలేదు. చివర కత నొక చోట కూచుని జేబులో వున్న డబ్బు లన్నీ తీశాడు. లెక్క పెట్టగా రెండు బేడకాసులూ, వక పావలా కాసూ, అయిదు ముద్దడబ్బులూ, తొమ్మిది విడిడబ్బులూ — మొత్తం మూడు పావలాల ముక్కానివుంది."

"లెక్క తేలేటప్పటికి నాగర్వం అంతా అణిగిపోయింది. వక్క అణాతో పదకొం డణాల ముక్కాని సంపాదించా డతను. ఇప్పుడు నా రెండణా లెక్కువా? అతని అణా యెక్కువా? వల్లమాలిన సిగ్గు వచ్చింది నాకు. మాట్లాడలేకపోయాను. పాపం, అతను చాలా మంచివాడు. ఇందాకా నేను తొందరపడ్డట్లే యిప్పు డతను తొందరపడితే నా పనేం కావలిసిందీ? నామాట లప్పుడే మరిచిపోయా డతను. 'మరి నువ్వు కొనుక్కుంటే కొనుక్కో. నా కేమీ అక్కర్లేదు. అంతకీ వుండలేకపోతే యింటికి వెళ్లి నాలుగు బటాణీగింజలు నోట్లో వేసుకుంటే పోతుం' దన్నా డతను. దీనితో నాకు ఛెళ్లున కొరడాదెబ్బ తగిలిన ట్లయింది. గొప్ప పరాభవం జరిగినట్లు తోచింది. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగిపోయాయి. చివరికి 'పద యింటికి పోదాం. నేనుకూడా యేమీ కొనుక్కోను' అని బయలుదేరాను."

"ఇంటికి వెళ్లాక అతను జరిగిం దంతా చెబుతూ డబ్బు లన్నీ వాళ్లమ్మచేతి కిచ్చాడు. నేను మాఅమ్మ కిచ్చేశాను. సంపాదించినందుకు వాళ్లమ్మ, ఖర్చు పెట్టకుండా తెచ్చియిచ్చినందుకు మాఅమ్మ సంతోషించారు. పైగా మాఅమ్మ నన్ను చేరదీసి 'నాయనా! మనం బీదవాళ్లం. వున్న డబ్బు లన్నీ ఖర్చు పెట్టుకోగూడ దమ్మా' అంటూ బుజ్జగించి ఆరాత్రి వక డబ్బు పెరుగు తెచ్చి నాకు ప్రత్యేకంగా పోసింది."

"ఈసంగతి నా కప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఇప్పటికిగూడా మంచకోడిగా వున్నప్పుడు నాకు జ్ఞాపకం వచ్చి యిది ఒక్కొక్క మెరుపుదెబ్బ కొడుతూనే వుంటుంది. ఇందులో యెంత వుపదేశం వుందో గ్రహించారా? మన బ్రహ్మగాళ్లలో నాలు గింగ్లీషుముక్కలు వచ్చాయంటే నౌకరీకోసం బయలుదేరడమూ, వైదిక విద్యలు నేర్చుకుంటే సంభావన్లకి తిరగడమూ, ఏచదువూ లేకపోతే కొందరు తగని వేషాలు వేసి కాని పరుగు లెత్తడమూ, కొందరు దానాలకీ, శొత్తర్లకీ తయారు కావడమూ సాంప్రదాయా లైపోయాయి. తక్కిన జాతుల కన్నింటికీ వృత్తు లున్నాయి గాని మన జాతి కేదీ? వక కాలంలో బ్రాహ్మణకులం విజృంభించడమూ, అత్యున్నతగౌరవాన్ని పొందడమూ నిజమే. అయితే మాట్లాడితే ఆపూర్వోన్నతిని తలుచుకోవడం తప్ప మన కిప్పు డేం వుందీ? మన జాతి తక్కిన ప్రపంచకం అంతటితోటీ వేరై వుండా లనీ, విలక్షణంగా వుండా లనీ, చాలా ప్రయత్నాలు చేసి ఆసాధనలో నెగ్గింది. అయితే అది యిప్పు డేమయిందో చూశావా? ఎక్కడ చూసినా బ్రాహ్మణనిందా, బ్రాహ్మణబహిష్కారమూనూ. కాలమూ, ప్రభుత్వమూ మారడంతోటే మన మాప్రత్యేకతని చంపుకోకపోవడంచేత చెర్లో చేపలు బయటపడ్డట్టిప్పుడు బయటపడిపోయాం. ఇంకా యిప్పు డేం చూశావూ నువ్వు? ముందు తరాలవాళ్ల కింకా వున్నాయి తిప్పలు."

"దాని కేమి లే? తరవాతి కథ విను. మాఅమ్మ వోమాటు దీపావళి కింకో కథ చెప్పింది. వక కోమటికొక కొడుకూ కూతురూనూ. దీపావళినా డత డిద్దరికీ చెరో రూపాయీ యిచ్చాడు. కొడుకు కవీ యివీ కొని ఆరూపాయి ఖర్చుపెట్టేశాడు; కాని కూతురు ఆరూపాయతో తండ్రిదగ్గరే బాణసంచా కొని దొడ్డిగుమ్మంలో కూచుంది. దీపాలు పెట్టేటప్పటి కొక రూపాయల్లా రెండయింది. కార్తీకపున్నానికి రెండల్లా నాలుగైనాయి. ఇక చెప్పే డేం వుందీ? వీథి అరుగుమీద తండ్రి కిరాణాకొట్టూ, దొడ్డిగుమ్మంలో కూతురు చిల్లరదుకాణమూనూ."

"కాలం గడిచింది. పిల్ల పెద్దదయింది. పెళ్లయింది. రజస్వల అయి కాపరానికి వెళ్లింది. వెళ్లేటప్పుడామె స్వార్జితం వెయ్యిరూపాయలు పట్టుకువెళ్లిందట."

"సెబాస్! ఎంత చక్కని కథా? ఇది కూడా జ్ఞాపకం వచ్చింది నా కప్పుడు. డబ్బుని పుట్టించడంలో

కోమట్లు కున్న నేర్పు మరెవ్వరికీ లేదు. సంపాదించడం లోనూ, ఖర్చుపెట్టడంలోనూ అంత జాగ్రత్తగా వుండే జాతి మనలో యింకో కేదీ? అసలు ఆర్థికనీతి కోమట్ల రక్తంలోనే వుంది."

"ఆసంగతీ, ఈకథా నాకు బలం కలిగించాయి. కథలు యథార్థాలా అంటే అది వేరే సంగతి. అవి కళ్లకి వెలుగిస్తాయి. మనస్సుకి ఉత్సాహమును కలిగిస్తాయి. బుద్ధికి కల్పనాశక్తిని పుట్టిస్తాయి. కొత్తదారి తోపిస్తాయి. కథలు వినడమూ, చదవడమూ యెప్పుడూ దండు గనుకోకేం."

## 3

"అర్జునుడికి శ్రీకృష్ణుని గీతోపదేశం యెలాంటిదో నాకు వాట్లస్మృతి అలాంటి దయింది. వర్తకం చెయ్యాలని బుద్ధి పుట్టింది. శ్రీహరీ! అయితే పెట్టుబడి యేదీ? చేతిలో దమ్మిడీ లేదు. వర్తకంమాత్రం చెయ్యాలి. వర్తకం అంటే యేమిటో నీకు తెలుసునా? అది చచ్చుల్లిపాయ అమ్ముకునే కోమటికి తెలవాలి గాని నాకరీ కోసం తంటాలుపడే బ్రహ్మిగాడి కేం తెలుస్తుందోయి?"

"పెట్టుబడి వుంటే లాభం వచ్చినా నష్టం వచ్చినా వర్తకం అంతా చెయ్యవచ్చు. లాభం కంటే ముందు పెట్టుబడి సంపాదించడంలోనే వుంది ప్రజ్ఞ. పెట్టుబడితక్కువా, బుద్ధియెక్కువానూ. వర్తకశాస్త్రంలో యిదో సూత్రం. దీన్ననుసరించికూడా ధనం సంపాదించవచ్చు. యాభై లక్షలు సంపాదించిన బసివిరెడ్డికి ఆది కాలంలో మూలధనం యెంతో యెరుగుదువా? ఇక్కడ మూడు మైళ్ల వెడల్పున్న గోదావరి పుట్టినచోట యెంత వుందో తెలుసునా? ఆదృష్టి లేందే నీకు?"

"ఆర్యపురంలో మాయింటిపక్క నొక ప్లీడరుండేవాడు. పెద్దచెయ్యి. నెల కేడెనిమిది వందలు వచ్చేవి. కాని ఖర్చులో మహాజోరుమనిషి. ఇక వెనకా ముందూ లేదు. పదేళ్ల ప్రాక్టీసయినా అద్దె యిల్లే. రెండో పెళ్లాం యివంతా చూసింది. ఆఫీసుఖర్చులు పోను మిగిలిన డబ్బుల్లో మూడువంతులు తన కిస్తేగాని అన్నం పెట్టనం దావిడ. రెండుమూసాలికి పూర్తిగా లొంగతీసింది. నామీద సంసారభారం పడేటప్పటికి ఆవిడ దగ్గిర చులాగ్గా యాభైవేలు చేరాయి. చిక్కని చెయ్యే గాని మొత్తానికి మహామంచి యిల్లాలు. నేనావిణ్ణాశ్రయించిచాను."

"అంటే వక్క రూపాయి బదు లడిగాను. 'మళ్ళీ నెల్లాళ్ళలో యిచ్చేస్తా' నన్నాను. నామాట తీసెయ్యలే దావిడ. కానయితే సాదరు కాతాలోనే ఖర్చువ్రాసుకుందిగాని రూపాయి మాత్రం నాకిచ్చింది."

"అబ్బాయీ! నావ్యాపారానికంతటికీ ఆవక్క రూపాయే పెట్టుబడి. నా మేడలకీ, నాభూములకీ, నాసర్వానికీ అదే మూలం. ఇప్పుడు రెండులక్షల కథ కారిమై వున్న చేబోలుశంభుశాస్త్రి వర్తకం వక్కరూపాయతో మొదలయింది."

"ఆరూపాయి పుచ్చుకుని బజారుకి బయలుదేరాను. మాఅమ్మ 'జాగ్రత్తసుమా నాయనా' అని దీవించి పంపింది. బజారులో అనేకరకాల సామాను వుంది. ఏమిటి కొనడమూ? ఏది తొరగా విడుదల అవుతుందీ? ఏమీ తోచింది కాదు. ఎవళ్ళతోటీ మాట్లాడకుండా యెడా పెడా చూసుకుంటూ కోటగుమ్మంవద్దిర నుంచి మశీదుదాకానూ, మశీదువద్దిరనుంచి కోటగుమ్మందాకానూ నాలుగుమాట్లు తిరిగాను. అప్పటికి నాదృష్టి బట్టల కొట్టుమీద పడింది. నవ్వు వస్తోంది కదూ నీకూ? నిజమే. ఆవక్కరూపాయీ పట్టుకుని వేలు ఖరీదు చేసే బట్టలకొట్టులోకి వెళ్ళినప్పుడు నాకూ వచ్చింది నవ్వు. తలవెంట్రుకకి పర్వతానికీ ముడివేసిన కథ జ్ఞాపకం వచ్చింది. 'వస్తే పర్వతం వూడి వస్తుంది; లేకపోతే వెంట్రుక తెగిపోతుం' దన్నాట్ట యెవడో. అలాగే నేనూ 'సాగితే యింత కొట్టూ చేస్తాను; లేకపోతే రూపాయిమాత్రం పూర్తిగా పోదు' అనుకున్నాను."

"కొట్టులో అడుగు పెట్టేటప్పటి 'కేంగావా!' లన్నాడు సాహుకారు. అప్పటి కొక బ్రాహ్మడు పెద్ద బేరం చేస్తున్నాడు. పెళ్ళికి బట్టలు కొనడానికి వచ్చాడాయన. 'నామాట తొందర లేదు. ముందు పెద్దబేరం

మాసుకో' అన్నాను. ఆయన బేరం తెమిలే టప్పటికి మనం యేం కొనాలో తేల్చుకోవచ్చునని కూడున్నాను. అరగంటలో ఆయన నూటయాభై రూపాయల సరుకు కొన్నాడు. అప్పటికి నాఆలోచన తేలింది. తువాళ్ళు చౌకగా కనపడ్డాయి. పావలా కొకటి యిచ్చాడాయనికి. నేనునాలుగు కావా లన్నాను. బేరం చెయ్యగా నాలుగూపద్నాలు గణాల కిచ్చి మిగిలిన బేడకీ చిన్న అంగా(స్త్రం వక టిచ్చాడు. ఆఅయిదుమూర్తులూ పట్టుకొనిబయలు దేరాను."

"వేలమీద పెట్టుబడి కనక కొట్టు పెట్టుకుని కూచున్నా డతను. మరి నేనేమిటే చెయ్యడం? మూటలు పుచ్చుకుని చాలామంది దేవాంగులు వూళ్ళో తిరుగుతూ వుంటారు. నాకూ అదే వుపాయం అనుకున్నాను. ఏం? అలా చూస్తావేం? ఇంటింటికీ తిరిగి తువ్వాళ్లు అమ్మడం తప్పుగా తోస్తోందా నీకూ? చెంబుపుచ్చుకుని ప్రతీగుమ్మమూ యెక్కడం కంటేనూ చెడ్డదా అదీ? కొంగు చాపుకొని ప్రతి ఆఫీసుకీ తిరగడం కంటేనూ చెడ్డదా?"

"నేను తిన్నగా యిన్నీసుపేటకి బయలుదేరాను. నాళంవారి సత్రంవగ్గరికి వచ్చాటప్పటికి నాకొక పంతులెదురై 'అవేమి?' టన్నాడు. 'తువ్వాళ్లు' అని చెప్పగా 'అమ్ముతావా?' అన్నాడు. మడత విప్పి చూపగా 'వక్కటే కావా లెంత కిస్తావ్?' వన్నాడు. ఆరణాలు చెప్పగా అయిదణాల కడిగాడు. 'నష్టం వస్తుం' దని చెబుతూనే డబ్బుడబ్బు చొప్పున తగ్గించి చివరి కయిదణాల కొక తువ్వా లిచ్చేశా నాయనికి. బజారుదాకా వెళ్ళ నక్కర లేకపోయినందు కాయన సంతోషించాడు. వెంటనే వకటి ఖర్చయినందుకూ, వేపారిపంతులు బోణీ అయినందుకూ నేను సంతోషించాను. వర్తకం అంటే బోధపడిందా? కొన్నివాడికీ అమ్మినవాడికీగూడా తృప్తే. వర్తకం చేస్తే యెవళ్ళ కొంపా తియ్యకుండానే నాలుగు రాళ్ళు సంపాదించుకో వచ్చు."

"ఇలాగ నావర్తకం నడివీధిలో ప్రారంభమై యిప్పుడు న డి బ జా రు లో స్థిరపడింది. మొదట నే నే కొట్టులో రూపాయ కయిదు మూర్తులు కొన్నానో ఆకొట్టుకి పక్కనే యిప్పుడు నాసొంత కొట్టుంది. సొంతం అంటే తెలిసిందా? కొట్టూ, కొట్టులోవున్న సరుకూ గూడా నావే. అయిదువేల కాయిల్లు కొనేసి తీర్చి, మేడ కట్టి, నాకొట్టువున్న గది కాక యింకోనాలుగు గదు లద్దికిచ్చా నిప్పుడు. మేడమీద వక మారువాడీ కాపరం పెట్టాడు. అతను ముప్ఫయ్యి, కింది కొట్లవాళ్లు యాభయ్యి, మొత్తం నాకొట్టు పోగా నెలకి యెనభైరూపాయలు వస్తాయా మేడవల్ల".

"మనం అప్పుడే అంత ముందుకి వెళ్లవద్దు. తరువాతి సంగతి విను. కొంచెం ముందుకి వెళ్లాటప్పటికి కొక బ్రాహ్మడు అంగా(స్త్రం చాకలిదానికి వేసినందుకు పెళ్లాంమీద కోప్పడుతున్నాడు. పాపం స్నానానికి వేళ అయిం దాయనికి. అంగా(స్త్రం లేదు. 'ఏపాత కండువా అయినా యీపూటకి వాడుకోండి' అంటుం దావిడ. ఆయన ధుమధుమ లాడుతున్నాడు. నే నివంతా కనిపెట్టి గుమ్మం యెక్కాను. ఆయన ఆవేగ్రపడ్డ మొగాన్ని నావేపుకి తిప్పి "యేం వచ్చావ్?" వన్నాడు. "తువ్వాళ్లూ అంగా(స్త్రాలూ కావాలా?" అనగా "చూపించ" మన్నాడు. ఇలా చూసీ, అలా చూసీ చివరి కాయన "యీదరిద్రం యెప్పుడూ వుండేదే" అంటూ అయిదణాల కాని కొక తువ్వాలూ, రెండణాల ముక్కాని కంగా(స్త్రమూ పుచ్చుకుని "యిక రెండేళ్ల దాకా యిబ్బంది వుండ"దని సంతోషిస్తూ అర్ధరూపాయి కాసు నాచేతిలో పడేశాడు. నాకు లక్షరూపాయలు దొరికినంత సంతోషం వచ్చింది. అయిదుమూర్తులకీ మూడు ఖర్చుపడ్డాయి. రూపాయికీ పదమూడణాలు సొమ్ము చేతిలో పడింది. తతిమ్మా మూడణాలకీ రెండు తువ్వాళ్లీ అయినజూ వుంది."

ఇంకాస్త ముందుకి వెళ్లేటప్పటి కొక బడిపంతు లొకటే, వక ప్లీడ రొకటే పుచ్చుకుని పదణాలు చేతిలో పడేశారు. ఇలాగ సరుకు చులాగ్గా విడుదల అయిపోవడమే కాకుండా రెండు గంటలలో వకరూపాయికి యేడణాల లాభం వచ్చింది. అప్పటికి తొమ్మిదయింది. మళ్లీ బజారుకి వెళ్లి ఆరుతువ్వాళ్లూ వకఅంగా(స్త్రమూ పుచ్చుకున్నాను. అర్ధణా మిగిలింది. దాన్ని

మాత్రం వూరికే మొయ్యడం యెందుకూ? ఇటూ అటూ చూడగా వకచోట చిక్కాలు కనపడ్డాయి. వర్తకుడర్ధణాకి మూడిచ్చాడు. నాళంవారి సత్రంవగ్గిర బల్లవాళ్లకి మూడూ మూడు కానుల కమ్మేసి మళ్లీ పేటలో పడ్డాను."

"పదకొం డయ్యేటప్పటికి తువ్వాళ్లారూ అయిదే సణాల కమ్మేశాను. అంగాస్త్రంమాత్రం వుంది. భోజనంచేసి మళ్లీ వద్దామని యింటికి మళ్లాను. నాళంవారి సత్రం కనపడేటప్పటి కొపూటా కక్కడ భోం చెయ్యాలని తోచింది. లోపలికి వెళ్లేటప్పటికి గుమాస్తా పద్దులు రాస్తున్నాడు. క్షణం దాటితే లాభం లేకపోవును. సమయం దాటిపోనందుకు సంతోషిస్తూ దగ్గిరికి వెళ్లగా గుమాస్తా నాపేరురాసేసి అటూ ఇటూ చూసిచివరికి "జనం యిద్ద"రని రాసుకున్నాడు. సాధారణంగా సత్రం గుమాస్తాలు చేసే పనే గాదూ అదీ? అది నే నోరకంటితో చూసి నవ్వుకుంటూ లోపలికి చక్కా పోయాను."

"పన్నిండున్నరకి భోజనం అయింది. అరగంట సేపు సత్రంలోనే పడుకున్నాను. వకటిన్నరకి బయలుదేరి మళ్లీ బజారుకివెళ్లి, పెద్దరకం కొన్నీ, చిన్నరకం కొన్నీ తువ్వాళ్లూ, అంగాస్త్రాలూ కొని మళ్లీ పేటలోకి వెళ్లాను. సాయంత్రం ఆరుగంటలదాకా తిరగ్గా సరుకంతా అయిపోయింది. సొమ్మేమాత్రం చేరిందో లెక్కపెట్టాలని తోచింది గాని నాప్రజ్ఞని మాఅమ్మకి చూపించాలని తొందర పుట్టింది. ఎన్నివిధాల ప్రయత్నించినా మనస్సు లొంగింది కాదు. కాళ్లలో వణుకు గూడా పుట్టింది. ఇక లాభం లేదని గబగబ యింటికి వెళ్లిపోయాను."

"మధ్యాహ్నం నే నింటికి రాకపోవడంచేత మా అమ్మ బెంగపెట్టుకుని వీథిఅరుగుమీద కూచుంది. ఆవిణ్ణి చూడడంతోటే నా కానందం పొంగిపోయింది. "మధ్యాహ్నం భోజనం చేశావా నాయనా?" అని మాఅమ్మ అడగ్గా "చెబుతాను రా" అంటూ లోపలికి వెళ్లి దీపం దగ్గిర కూచుని సంచి గుమ్మరించాను. లెక్కపెట్టగా అప్పు తెచ్చిన రూపాయి కాక యింకో రూపాయి మూడణాల కాని వుంది. వక్కక్షణందాకా నాకు శరీరం తెలిసిందికాదు. ఏం తప్పా? నాజీవితంలో కళ్లు తెరవని సమయంలో 'హరిఃఓ'మ్మని సంసారబాధ్యత వహించిన మొదటిరోజున—వక్క రూపాయి పెట్టుబడిమీద వర్తకంలో మిగిలిన మొదటి లాభ మది. ఒక సంవత్సరంలో గవర్నరుకి వచ్చే జీతంకంటే గూడా అది విలవయింది. వాస్తవంగా నాజీవితాని కది ఉన్నతి కలిగించిన గొప్ప వరం. దాన్ని తలుచుకుంటే నాకిప్పటికి గూడా ఆనందం పురకలు వేసుకుని—హాయి హాయి! ఎంత సౌఖ్య మోయి! ఇలాంటి అనుభవం లేనివాడి బతు కేం బతు కోయి! ఏం, కష్టంగా వుందా నీకూ? పోనీ తరవాతి కథ విను."

"అప్పుడు మాఅమ్మ ముఖంమీద నృత్యం చేస్తూ వున్న ఆనందజ్యోత్స్నవల్ల నాభవిష్యజ్జీవితం అంతా ప్రకాశమానంగా కనిపించింది. జయలక్ష్మి మందహాసం చేస్తూ నా మెడలో పుష్పమాల వెయ్యడానికి వయ్యారి నడకలతో వస్తూవున్నట్లు కనపడింది. "నాయనా! చదువు లేకపోతే యేమిలే? ఈశ్వరు డిలాగేనా యింత అన్నం పెడితే చాలు. నువ్వొక యింటివాడవైతే నా కదే పదివేలు. కనడమే కాని మేము నీ కేమీ యివ్వలేకపోయాం. నీరెక్కలు చల్లగా వుండి నాలుగు డబ్బులు సంపాదించుకుంటివా, నలుగురిలోనూ తల యెత్తుకుని తిరగవచ్చు. ఉద్యోగాలకోసం నువ్వు చూడవద్దు. చివరికి చిల్లరదుకాణం పెట్టుకున్నా నిర్విచారంగా కాలం గడిచిపోతుంది"అని మాఅమ్మ నన్ను ప్రోత్సహించింది. అయితే ఉద్యోగంకోసం సుఖమయ కల్పనలు చేసుకుంటూ వున్న నీ కివంతా హాస్యాస్పదంగా కనపడవచ్చు. అవునా పంతులూ? "ఇంటింటికీ తిరిగి గుడ్డ లమ్ముకుని నాలుగు డబ్బులు మిగిలే యని యింత పొంగిపోతా డేమిటిరా యీయనా?" అని నువ్వు మనస్సులో నవ్వుకుంటున్నావు కదూ? ఎంత పాడయిపోయిం దోయి బ్రాహ్మణవర్ణం! తాలూకాకచేరీలో అటెండరుపనీ, పోలీసుస్టేషనులో కానిస్టేబులుపనీ, కోర్టులో అమీనా పనీ,—ఇంకా యిలాంటి పన్నీ

మంచివే అయినా బ్రాహ్మణజాతిమీద యితర్లు రాళ్లు రువ్వారంటే ఆశ్చర్యమా? "మేం అగ్రకులంవాళ్ల" మంటూ నౌకరీల కెగబాకడం గొప్పే కాని బ్రాహ్మలకి చిల్లరవర్తకం నీచకం. అవును. పర్వతశిఖరంమీద "నన్నే చూసుకో" అని వొంటికాలి భరతం ఆడినవాడు కొండలోయల్లో పడిపోవడం ధర్మమే. దాని కేంలే, తరవాత చెప్పనియ్యి."

"మధ్యాహ్నం నే నింటికి వెళ్లకపోవడంచేత నాకోసం వండిన అన్నం మిగిలిపోయిందికాదూ? అది నాకు పెట్టేసి మాఅమ్మ పిండి చేసుకుని తింది. తరవాత యిద్దరమూ ఆమాటా యీమాటా చెప్పుకుని పడుకున్నాం. సగంరాత్రిదాకా నాకు నిద్ర పట్టింది కాదు. తరవాత వొళ్లు తెలవని గాఢనిద్ర పట్టింది."

"తెల్లవారింది. అప్పు తెచ్చిన రూపాయి యిచ్చెయ్యడమా? వుంచుకోవడమా? నాలుగైదు నిమిషాలు ఈవిషయం ఆలోచించాము. నెల్లాళ్ళ వాయిదా వున్నప్పు డెందు కట్టేపెట్టుకో గూడదూ? ఈలోపున ఆనక్క రూపాయీ యింకా యిరవైతొమ్మిది రూపాయీల సరుకు తెస్తుంది. రోజుకి ఒకరూపాయి పావలా లాభం తెచ్చిన రూపాయి అది. అంటే యింకా యెంత తక్కువైనా యిరవైతొమ్మిది కరుకులు పుట్టిస్తుంది. ఇలాంటి లెక్కలు కట్టడం నీకింకా చేతకాదులే. వూరికే విను. చివరి కారూపాయి అట్టేపెట్టుకోడానికే నిశ్చయించుకున్నాను."

"మళ్లీ యేదున్నరకి చద్దన్నం తిని బయలుదేరాను. అప్పటి కింకా నిన్న కాతాకలిసిన సాహుకారు కొట్టు తెరవలేదు. ఈపక్కనీ, ఆపక్కనీ మరి కొందరు తెరిచారు. అక్కడి బేరా లెలా వుంటాయో చూద్దామని రెండుమూడు కొట్లకి వెళ్లాను. నాకింకా కుర్రతనం కాదూ? జాతిని పట్టే, వయస్సునిపట్టే, తెలివితేటలు చూసీ, సరకు అమ్మే మన వర్తకులు బేరంలో లొంగుతారూ? మామూలు గడుసుదనపురాకడ లన్నీ వచ్చారు. కొందరు "మీకు కనక తక్కువ కిస్తా" మంటూ నిన్న మూడణాల నరకి కొన్నతువ్వాళ్లు పావలాఅర్ధణా కంటగట్టా లని చూశారు. అన్నిధరలూ అలాగే వున్నాయి. వక కొట్టులో రూమాళ్లుమాత్రం చౌకగా కనబడ్డాయి. చాలా అందంగా కూడా వున్నాయి. షోకేలాలూ, కొంచెం నీటుగా వుండా లనుకునీవాళ్లూ చూస్తే విడిచిపెట్టరు. చెన్నపట్నంనుంచి తొలి నాటి సాయంత్రమే వచ్చింది సరుకు. వాట్లని మొదట నేనే చూశాను. జత రూపాయి చెప్పాడు. ఎన్నివిధాల అడిగినా దమ్మిడీకూడా తగ్గలేదు. ఏంచెయ్యనూ? సరుకు చూస్తే కళ్లు మెరిసిపోతున్నాయి. అమ్మా లని వున్న నాకే అలా వుంటే కొనా లనుకునీవాళ్ల కేలా వుండునూ? ఏమయితే సరే అని నాలుగు రూమాళ్లూ, వక అంగాస్త్రమూ పుచ్చుకుని బయలుదేరాను. తొమ్మిదింటికే అవి ఖర్చయిపోయాయి. పదణాలు మిగిలేయి. మళ్లీ మళ్లీ కొని మళ్లీ మళ్లీ అమ్మాను. ఆరోజంతా రూమాళ్ల బేరమే. మొదటిమాటు శాంపిలుగా మూడు డజన్లు మాత్రమే వచ్చాయి ఆకొట్టుకి. మూడో నాలుగో తప్ప తక్కిన వన్నీ నేనే అమ్మేశాను. రెండురోజుల పూట కాసరు కయిపోయింది. ఆబేరంలో నా కయిదారు రూపాయలు మిగిలాయి. అవి ఆనక్క కొట్టులో మాత్రమే వుండడంచేతా, అక్కడైనా చాలా కొద్దిగా వుండడంచేతా, పైగా మళ్లీమళ్లీ నేనవే అడగడంచేతా, వకటి రెండుమాట్లు సాహుకారు జత వక్కంటికి పావలా దాకా ధర పెంచాడు కాని లేకపోతే నాకింకా నాలుగైదు రూపాయలు మిగిలివుండును. కాకపోతే యేమిటి? బేరం లాభసాటిలో వుంది కాని నష్టజాతకంలో లేదు కదూ? నా కదేచాలనుకున్నాను మళ్లీ సరుకు భారీగా తెప్పించమనీ, చాలామట్టుకి నేనే పుచ్చుకుంటా ననీ అతనితో చెప్పి తరవాత రకం మార్చాను."

"చేతిలోకి పది రూపాయలు చేరాయి. కావలసినంత ధైర్యమూ, ఉత్సాహమూ, బలమూ, కలిగాయి. ఈమాటు వకకొట్టే అన్నమాటేమిటి? నాలుగు కొట్లూ చూశాను. ధరలు కనుక్కుని రాయితీగా యెక్కడవస్తే అక్కడే పుచ్చుకోవడం; ఇక తువ్వాళ్లనీ, రుమాళ్లనీ, అంగాస్త్రాలనీ, వక టేమిటి? ఏది ఖర్చుపడితే యని

తోస్తే అవీ, వేస్లలో నాలుగుడబ్బులు మిగులుతా యంటే అవీ, యెవ రేవి తన్నుమంటే అవీ అమ్మడం మొదలు పెట్టాను. పది హేనురోజు లయేటప్పటికి బజారులో అరువు దొరకడమూ, ఎవరేనా అడిగినవి యిస్తామంటే అమ్మకం కాకపోయే యెడల మళ్లీ పుచ్చుకునే పద్ధతీ, మొద లయినాయి. అదివరలో చంకలో యిమిడే మూట బుజం యెక్కడం మొదలయింది. వీథిలో వెళ్తూవుంటే చాలామంది "రా, పో" అని పిలవడం మొదలు పెట్టారు. రాజమండ్రిలో—విశేషించి ఇన్నీసుపేటలోనూ, మొరకవీథినీ, నేను బట్టలవర్తకుణ్ణిగా చెలామణీ కావడం మొద లయింది."

"నెల్లాళ్లు గడిచే టప్పటికి స్త్రీలు రకరకాల రవికల గుడ్డలూ, పరికిణీగుడ్డలూ, చీరలూ, తెమ్మనడం యెక్కువయింది. రెండు మాసాలికి గిరాకీ మరీ పెరిగింది. మూడు మాసాలకి నేను బ్రాహ్మణ్ణనీ, లోవరుసెకండరీ చదివా ననీ, చాలామందికి తెలిసింది. ఆకాలంలో లోవరుసెకండరీ అంటే యిప్పుడు బి.యే. అన్నమాట. అంచేత "నీకీగతేమిటయ్యా?" అని కొందరడిగేవారు. కొందరు "యోగం యిలా వుం"దని పరామర్శ చేశేవారు. నాకు నవ్వు వచ్చేది. మొదట్లో నేనేదేవాంగినో అనుకుని "ఏమోయి" అన్నవారంతా తరవాత "ఏమండీ!" అనీ, "ఏమయ్యా"అనీ, దర్జాగల కొందరు చివరికి "పంతులూ" అనీ పిలిచేవారు."

"మొదట్లో నెల్లాళ్లదాకానే నేను మనిషిదగ్గర మనిషి బేరం చెప్పాను. తరవాత అది తప్పని తెలుసుకున్నాను. కానీ మనిషి తెలివితేటల ననుసరించి వకకోట అణా మిగిలిన వస్తువులో యింకోకోట రెండణాలు మిగలవచ్చు. మొత్తానికి లాభం లేకుండా యెవడూ యివ్వడు. కనక మనిషిని పట్టి బేరం చెప్పడం మోసం అని తోచింది. అంచేత తరవాత వక్కటే ధర చెప్పడం మొదలు పెట్టాను. మొదట కొంతటిదగ్గర యిది వికటించింది కాని వోపిక పట్టాను. సంగతంతా చెప్పేటప్పటికి అంతా బాగుం దని సంతోషించారు. ఇలాగ అనిపించుకునే టప్పటికి ఖరాగా నెలరోజులు పట్టింది. ఈ నెల్లాళ్ల కష్టంవల్లా నాకు కలిగిన లాభం యేమి టంటే: తరవాత మాటదింపడం తరవాయి, కావలసిం దేదో చూసుకోవడమూ, ఎంత కావాలో యోచించుకోవడమూ, ఖరీదెంత అయిందో లెక్క చూసుకుని సొమ్మిచ్చి పంపెయ్యడమునూ. అంటే నాకు తరవాత రెట్టింపు వర్తకం జరిగింది. లాభంకూడా పెరిగింది."

౫

"చెప్పవచ్చిం దేమి టనగా: అమూడు మాసాలలోనూ నాకు సంసారపుఖర్చులుకూడాపోను, నూరు రూపాయలు మిగిలాయి. కోటలో పాగా వేశా ననుకున్నాను. మాఅమ్మకూడా "నాయనా! నెగ్గా" వంది; "లక్ష్మి నిన్ను వరించిం" దంది. నెల కాగానే ప్లీడరుగారి పెళ్లానికి రూపాయి యిచ్చేశాను. నాసంగతి విని ఆవిడ చాలా సంతోషించి "రూపాయి యిచ్చేదేమి?" టని పుచ్చుకోడాని కంగీకరించింది కాదు గాని చివరికి తప్పింది కాదు. "ఇదంతా మీచలవే" అని నా కృతజ్ఞతని తెలిపి నమస్కరించగా ఆవిడ నోటురాయనక్కర లేదు. వడ్డీకూడా పని లేదు. నీకు కావలసినప్పుడు కావలసినంతసొమ్ము చేబదులుగా పట్టుకుని వెళ్లవచ్చు" నని చెప్పింది".

"పదిమందీ పది రకాలు కోరుతూ వుండడంచేత యిక మూట చాలింది కాదు. అదీ కాక: కొద్దిరోజులలోనే చంకమూటని బుజంమూటగా మార్చేసినవాడు బుజంమూటని కావిడిగా మార్చెయ్యకపోతే యిక ప్రజ్ఞ యేం వుందీ? అంచేత తరవాత నెలజీతంపద్ధతిని కావిటివాణ్ణి కుదిర్చాను. విన్నావా పంతులూ? నెలజీతంపద్ధతిమీద కావిటివాణ్ణి కుదిర్చాను. ఇప్పుడు నీకుమల్లే నేనప్పుడు నౌకరీకోసమే ప్రయత్నించి వుంటే బతికివున్నంతకాలమూ నౌకరుగానే వుండిపోదును. అలా కాకుండా "బ్రాహ్మణజాతిలో పుట్టి దేవాంగిలాగ యింటింటికీ మూటలు మొయ్యడం యేమిటోయ్!" అని కొందరిచేత యీసడింపులు తిన్నా, వోపిక పట్టడంచేత మూడు మాసాలు గడిచేటప్పటికి నాకే వక నౌక రవసర మయినాడు. ఇప్పుడు లెక్కలు రాయడానికి ముగ్గురు గుమా

స్తాలూ, అమ్మకం చెయ్యడానికి నలుగురు సత్రకాయలూ, లోటుపాటులు చూడడాని కొకడూ, చిల్లర పనులు చేస్తూవుండడాని కిద్దరు నౌకర్లూ, వీరు కాక యింటివద్దిర నలుగురూ నన్నాశ్రయించుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారు."

"ఇది గర్వంతో చెప్పింది కాని, వారిని న్యూనత పరచాలని చెప్పింది కాని కాదుసుమా."

"యిక్కడ యింకో సంగతి చెప్పవలసివుంది: స్వార్జితం నూరురూపాయలు నాచేతిలో వుండడం నువ్వెరుగుదువు. మహేంద్రవాడలో నాకో చిన్న స్థలమూ తాటాకుల యిల్లూ వుండేవి. ఇక నేనా వూరు కాపరానికి వెళ్ళినప్పుడు ఫాయిదా నష్టం తప్ప వాట్లవల్ల నాకేం లాభమూ? మాఅమ్మా నేనూ యీసంగతే ఆలోచించాము. వెంటనే పనిచేసి వారంరోజు లక్కడ వుండి అయిదువందల రూపాయల కమ్మేసి వచ్చేశాను. నూరు రూపాయలు సొంత శక్తివల్ల సంపాదించేదాకా మాకాసాహసం కలగలేదు. రాజమండ్రీలో మర్యాదగా కాలం గడపగలమనే ధైర్యం కలిగేక ఇక అదెందుకూ? ఆ అయిదు వందలూ, యీవందా — ఆరు వందలతో చేబోలు శంభుశాస్త్రి వర్తకం పురెక్కింది. ఈమాటు సరాసరీ సీమనుంచి సరుకు తెప్పించే మారువాడీతో కాతా కలిపాను."

"ఇక యింటింటికీ వెళ్లి "యేమైనా బట్టలు కావాలా?" అని యెవర్నీ అడగడం లేదు. కావిటివాడు వెనకాల రకరకాల గుడ్డలపేర్లు చెబుతూ కేక వేస్తూ వస్తూవుండగా నేను గుబ్బగొడుగు వేసుకొని ముందు నడుస్తూ వుండడం. ఎవ రేనా పిలిస్తే లోపలికి వెళ్లి కావిటివాడు కంబళీ పరిచి మాటలు విప్పగా చూచుని కావలసిన సరు కిచ్చి సొమ్ము పుచ్చుకొని లేవడం. మళ్లీ ముందు నడవడం. కడుపులో చల్ల కదలకుండానూ, ఆందోళనం లేకుండానూ నింపాదిగా తిరిగి సాయంత్రానికి పదిరూపాయలకి తక్కువ లేకుండా అమ్మి మెల్లిగా యింటికి చేరుకునేవాణ్ణి. ఖర్చులన్నీ పోను సకటున రోజుకి రూపాయిన్నర తక్కువ లేకుండా చులాగ్గా కిట్టేది."

"ఇలా సంవత్సరం తిరిగేటప్పటికి వ్యాపారం వెయ్యి రూపాయలికి దాటింది. ఇంకో సంవత్సరానికి రెండు వే లయింది. అయితే కావిటిమీదకి రెండు వే లెందుకూ? ఎంత సరిపోతే అంతే నడుపుదామంటే తక్కిన రూపాయలు పెట్టిలో పెట్టుకుని కూచుంటే యేం లాభమూ? కనక కావిడి విడిచిపెట్టెయ్యాలని తోచింది. ఇక దుకాణం పెట్టాలి. కాని రాజమండ్రీ పెద్ద బజారులో బట్టలకొట్టు పెట్టా లంటే రెండు వేలేమూలకీ! కావడికి హెచ్చూ, కొట్టుకి లోచ్చూనూ. గోచీకి పెద్దా, అంగాస్త్రానికి చిన్నా అన్నకాడికి వచ్చింది నావ్యాపారం. ఏమిటి చెయ్యడం?"

"రెండు రోజు లాలోచించాను. "ఇంకా కావిడేమి టీపాటికి కొట్టు పెట్టవయ్యా" అని యిదివరకే మారువాడీ చాలామా ట్లన్నాడు. "ఏరోజు అమ్మకం ఆరోజున నా కిచ్చేసేటట్లయితే నాలుగువేలు తెస్తివా పదివేల సరు కిస్తా" నని కూడా రెండు మూడు మాట్లన్నాడు. చేతిలో వున్న రెండు వేలకీ సాయం యింకో రెండువేలు కావాలి. ఎవ రిస్తారూ?"

"పక్కని ప్లీడరుగారి భార్య, సోదమ్మగారు వుంది కాదూ? ఆవిణ్ణడుగుదామని తోచింది. మాటల్లోపోయి నావర్తకం కావిట్లోకి వచ్చాక — అందులోనూ రెండువేల దాకా పెరిగాక మాఅమ్మకీ ఆవిడకీ వకటే ప్రాణం అయిపోయింది. అస్తమానూ ఆవిడ "మీ అబ్బాయి ప్రయోజకుడండీ. మీరు అదృష్టవంతు లండీ" అనీది మాఅమ్మని. ఇంతే కాకుండా నేనావిణ్ణి "అక్కయ్యగారూ" అనడమూ, నన్నావిడ "సాహుకారు తమ్ముడూ" అనడమూ ఎక్కువై పోయింది. ఆ చనువు ఆధారం చేసుకుని నేనూ మాఅమ్మా వకనాడు వెళ్లి ప్రస్తావన చేశాము. వెంటనే ఆవిడ "ఈమాత్రందానికి ఆలోచనా, బతిమాలడమూ రేమి టండి పిన్నిగారూ? నీకు సందేహం యెందుకు కలిగింది తమ్ముడూ?" అంటూ యినపపెట్టి తెరిచి, "నీకుకావలసినన్ని పుచ్చుకో" అని నాలుగువేల రూపాయల బాంకినోట్ల కట్టలు ముందు పడవేసింది. నా దగ్గిర వుండే రెండు వేలలోనూ అయిదు వందల దాకా సరుకే వుంది కాదూ? అంచేత తతిమ్మా

పదిహేను వందలకీ సాయం నాలుగువేల పూర్తికి ఇరవై అయిదు నోట్లు తీశాను. ఆవిడ "చాలా?" అంది. "ఎప్పుడు కావలిస్తే అప్పుడే అడుగుతా" ననీ, "యిప్పటికివి చా" లనీ, చెప్పగా పెట్టి వేసేసి భర్తదగ్గిరికి వెళ్ళి, "యిరవై అయిదు వందల రూపాయలు మాసాహుకారు తమ్ముడు పేర ఖర్చు రాసుకోండి; నూటికి పవణాల చొప్పున ఫాయిదా. నోటు అక్కర్లేదు. చిఠాలో సంతకం చేస్తాడు" అని చెప్పి వచ్చింది. ఆవిడ అనుగ్రహానికి నేనూ మాఅమ్మా కూడా పొంగిపోయాం. కాదూమరీ? మొదట నావర్తకానికి పెట్టుబడి యిచ్చిందీ ఆవిడే; ఇప్పుడిలాగ మళ్లీ పెద్ద లోటు తీర్చిందీ ఆవిడే. అర్థాత్తూ యేమున్నమాటూ? నా పురోభివృద్ధికి—నా విజయానికీ ఆవిడ చల్లని చెయ్యే ఆధారం అయింది కాదూ? అలాంటి మాఅక్కగారి విషయంలో నేనెంత ఋణపడివున్నానో వేరేచెప్పడం యెందుకూ? ఏం చేస్తే నే నామె ఋణం తీర్చుకోగలనూ?"

"తరవాత చిఠాలో సంతకం చేసి, నాలుగు వేల రూపాయలూ మారువాడీ దగ్గిర జమ కట్టించి, "కొట్టు చూసుకుని వస్తా"నంటూ బజార్లోకి బయలుదేరాను."

"పంతులూ! నువ్వు దాన్నదృష్టం అను, మరేమైనా అను: ఒక్కొక్కప్పుడు వరసగా మేళ్లే కలుగుతాయి. నే నిట్టే బజారులోకి వెళ్లేటప్పటికి మొదట నే నే కొట్టులో రూపాయికయిదు మూర్తులు కొన్నానో, దాని పక్కది రెండు దినాల్లో ఖాళీ అవుతుం దని తెలిసింది. వెంటనే యజమానితో మాట్లాడగా నెల కెనిమిది రూపాయలు అద్దికట్టి నాకు ఖాయం చేశాడు. అద్దిచీటీ మూడేళ్లకి రాసుకున్నాం. ఆరెండు రోజులూ యథాప్రకారంగా కావిడితోటే పూళ్లో తిరిగి, యెరిగున్నవా రందరితోటీ "ఇక కావిడి పట్టించుకొని పూళ్లోకి రా"ననీ, "బజారులో ఫలానాచోట కొట్టు పెడుతున్నా"ననీ, "యేరకం బట్టలు కావలిసి మీరు బజారుకి వచ్చినా మొదట నా కొట్టుకి వచ్చి సరుకూ, ధరలూ, చూసుకోకుండా మరోకొట్టుకి వెళ్ల వ"ద్దనీ, "ఇన్నాళ్లదాకా నా మీద అనుగ్రహం వుంచిన ట్లికముందు కూడా వుంచా"లనీ చెప్పి వచ్చాను."

౬

"అనుకున్న రోజున కొట్టు ఖాళీ అయింది. సరుకుసర్దాను. అదిచూచి మొదటి కాతాదారు "వోయి పిడుగూ! వక్క రూపాయతో నా కొట్టులో కాతా పెట్టి, వర్తకం సాగించి, చివరికి నాకే పెట్టేవూ యేసరు?" అన్నాడు. కాదూ మరీ? అతని కొట్టులో వున్న సరుకు నా సరుకుకంటే గొప్పది కాదు. నాకొట్టులో మును పున్న వర్తకుడు చిన్నపద్దనడంచేత పాపం అతనికి బాధ వుండీది కాదు. ఇప్పుడు పక్కని పెద్దపోటీ తగిలింది. వీధే పోయీవాళ్ల కళ్లు నాలుగురకాలూ పూటుగా వుండడంచేత మొదట నాకొట్టుమీదే పడుతున్నాయి. కాతాలు కలుపుకోవడంకోసం మొదట అందరికంటే కొంచెం చౌకగాకూడా అమ్మసాగాను నేను. ఈకారణాలచేత అత నలా అనడంలో వైపరీత్యం యేమీ లేదు. కాని యెవడి బేరకింద కెవడు తోడుకోవడం మానాడూ? మనుష్యులలో స్వార్థపరత్వమే లేకపోతే యిక ప్రపంచకమే యేదీ?"

"ఇంకోసంగతి నీతో చెప్పడం మరిచిపోయాను. మారువాడీ ఏరోజు అమ్మకం ఆరోజున తనకి జమ యిమ్మన్నా డన్నాను. జ్ఞాపకంవుందా? అలా అయితే నా సంసారంయెలాజరుగుతుందీ? అక్కగారి బాకీయెలాతీరుతుందీ? చివరికి కొట్టు అద్ది యివ్వడంయెలాగా? మారువాడీతో యీసంగతులు సరుకుపుచ్చుకునేటప్పుడేచెప్పగా "ఏమంటా?"వన్నాడు. నే నింకా భాగ్యవంతులలో చేర లేదుకదూ? ఋణగ్రస్తుణ్ణే కదూ? కనక నెలకి పాతిక రూపాయలకంటే సంసారాని కెక్కువ ఖర్చు చెయ్యకూడ దనుకున్నాను. క్రమంగా నెలకి పదే సణాలు తగ్గినా, సోదెమ్మక్కగారి బాకీ అసల్లో వందా, అసలుకయిన ఫాయిదా పదిహేను రూపాయల పవణాలూ తీర్చా లనుకున్నాను. కొట్టుఅద్దియెనిమిదిరూపాయలు, చిల్లర ఖర్చులు పది, మొత్తం "నెలకి నూటఅరవై రూపాయలు తీసుకుంటా" ననగా సరే అన్నాడు.

"నెల్లాళ్లు కొత్తగా వుంది. మూడు మాసాలు వెళ్లేటప్పటికి బేరాలు పెరిగాయి. ఆరు మాసాలకి పల్లెటూళ్ల వర్తకుల కాతాలు పెరిగాయి. సంవత్సరం తిరిగేటప్పటికి కొట్టులో తెరిపి వుండీదికాదు. అది మొదలు నేటిదాకా. నాకొట్టు అలాగే జరుగుతోంది."

"రెండేళ్లకే అక్కగారి బాకీ తీర్చేశాను. మారువాడీ చిఠాలో జమా ఖర్చూ సరిపోతున్నాయి. చెన్నపట్నంలో కాతాలు కలిపాను. బొంబాయినుంచికూడా సరుకు వస్తోంది. స్వతంత్రుణ్ణయినాను."

"టెంగ తీరింది, "నాయనా! బతికి వున్నందుకు ఫలం కనపడింది. నువ్వీస్థితికి రావడంకళ్లతోచూశాను.

నా తండ్రీ! ఇక నాకు విచారం లేదు" అంది మా అమ్మ. అక్కగారు మెచ్చుకున్నారు. ఆమె భర్తకు అప్పటికి తెలిసింది శంభుశాస్త్రి ప్రయోజకత్వం."

"ఇక నాకు పెళ్ళాం తక్కువ కదూ? ఇదివరకే కలిగివుంటుంది నీకా సందేహం. అబ్బో! యీకాలం వాళ్ళకి ప్రజ్ఞకంటె ముందు పెళ్ళాం కావాలి. తరవాత నాటకాల్లో తిరిగినా యే ఘట్టుఫారమో చదువుతున్నావంటే అసలు కన్యాదాతలు నిలవ నిస్తారుటయ్యా యిప్పుడైనా? ఇప్పుడు పెళ్ళికొడుకుల తండ్రుల కెంతబింకం వుంటోందో అప్పుడు పెళ్ళికూతుళ్ళ తండ్రులకంత బింకం వుండేది. ఇప్పుడు మొగపిల్లలికి బేరాలు వస్తున్నట్లు అప్పుడు ఆడపిల్లలికి వచ్చేవి. సాంప్రదాయం కలవాళ్ళు మాత్రం కన్యాదానం చేసి "దశపూర్వేషాం, దశాపరేషాం" అని సంతోషించేవారు. డబ్బో యోగ్యతో లేకపోతే అప్పుడు మొగాళ్ళకి పెళ్ళయ్యేది కాదు. నా యీడువాళ్ళెందరో బ్రహ్మచారులుగా వుండిపోయారు.

"సోదెమ్మ అక్కగారికి ఒక కూతురూ యిద్దరు కొడుకులూనూ. నాకు యిరవై మూడేళ్ళు దాటేటప్పటికి — అంటే నాకూ మా అమ్మకీ కూడా నా పెళ్ళిని గురించి ఆలోచన పుట్టేటప్పటికి, సావిత్రికి పన్నెండేళ్ళు నిండాయి. వారికి కూడా పెళ్ళివూహ కలిగింది. ఒకనాడు మా అమ్మా, అక్కగారూ కూచుని లోకాభిరామాయణం యెత్తుకోవడంలో. నా పెళ్ళిని గురించి మా అమ్మా, సావిత్రి పెళ్ళిని గురించి అక్కగారూ ప్రస్తావన చేసుకున్నారట. ఆవేళ ఆ సమావేశం ముగిసేటప్పటికి వారిద్దరూ వియ్యం అందా లనుకున్నారట. ఆరాత్రి మా యింట్లోనూ, వారి యింట్లోనూ కూడా ఆలోచనలు జరిగాయి. మర్నాడు పొద్దున్న "మధ్యాహ్నందాకా కోర్టుకి వెళ్ళవ"ద్దని అక్కగారు నాకు కబురు చేశారు. ఎనిమిదయేటప్పటికా భార్యాభర్త లిద్దరూ వచ్చి మాటలు కలిపారు. తొమ్మిదింటికి నిశ్చయాలూ, పదింటికి ముహూర్తం పెట్టించడమూ, పదకొండింటికి విందులూ అయిపోయాయి. పదిహేను రోజులకి పెళ్ళి కూడా అయిపోయింది."

"సావిత్రి కాపరానికి వచ్చేటప్పటికే బజారులో మేడ కట్టేశాను. తరవాత మూడేళ్ళకి పేటలో యీ మేడ కట్టాను. క్రమంగా మహేంద్రవాడలో రెండుపుట్ల భూమి కొన్నాను. ఇప్పుడు సీమనుంచే సరాసరిగా నాకు సరుకు వస్తుంది."

"నా పెద్దకొడుకు కోర్టుమీద వుంటాడు. నా రెండోకొడుకు గోదామూ, సంసారమూ చూసుకుంటాడు. నా మూడో కొడు కిప్పుడు సీమలో వున్నాడు. అక్కడ వైద్యపరీక్షకి చదువుతున్నాడతను. నా కూతుళ్ళిద్దరూ కాపరాలు చేసుకుంటున్నారు."

"నా పెద్దకోడలు ఒక యెస్టేటు దివానుగారి కూతురు. రెండో కోడలు మన సబుజడ్జిగారి కూతురే. మూడోవాడి కింకా పెళ్ళి కావాలి. నా పెద్దల్లుడు ఏలూరిలో ప్లీడరూ. నా చిన్నల్లుడు నాలాగే — అంటే యింత బట్టలవర్తకమూ చేస్తున్నాడు."

"అదిగో మా నాన్నగారి తాంబూరా. వారి ఫోటో లేదు. ఆ తాంబూరానే నా పూర్వపు ఆస్తిగా చూసుకుంటున్నాను. అదిగో మా అమ్మ; నాకేసి నవ్వుతూ యెలా చూస్తోందో చూడు. చిత్రకారుడు జీవకళ ఉట్టిపడేటట్టు రాశాడు పాపం. వెయ్యి రూపాయ లిచ్చా నతనికి."

"ఇదంతా యెందుకు చెప్పానంటే? ఆలోచించు: నీకు ప్రస్తుతం నౌకరీ దొరకడమే కష్టం. దొరకినా వెంటనే స్థిరం కాదు. అయినా పాతిక రూపాయలకంటె యెక్కువ జీతం రాదు. నీ జీవితంలో నెలకి వంద రూపాయల జీతం నువ్వు చూడవు. ఎందుకు వెర్రిపడతావూ? ఏదో వర్తకం చేసుకో. డబ్బు లేకపోతే డజ నగ్గిపెట్టెలూ, వంద చుట్టలూ పుచ్చుకొని పొద్దున్న స్టీమర్ల దగ్గిరా, మధ్యాహ్నం కోర్టుల దగ్గిరా, సాయంత్రం సినీమాదగ్గిరా తిరుగు. లేకపోతే వరదారావుహోటలుదగ్గిర కిళ్ళీల దుకాణం పెట్టుకో. అదీ కాకపోతే కుట్టుమిషను పెట్టుకుని నాకొట్టువగ్గిర కూచో. మిషను ఖరీదు నేనిచ్చేస్తాను. నువ్వు మళ్ళీ యివ్వనక్కరలేదు. అదీ కాకపోతే కావిడుగుడ్డ లేవి కోరితే అవి యిస్తాను; వూళ్ళో తిరుగు. దమ్మిడీ పెట్టుబడి అక్కర్లేదు. ఏరోజు లాభం ఆరోజు పట్టుకుపో. మా మేడలో ఒక మూల ఒక వసారా, ఒక గదీ ఒక చిన్న హాలూ అద్దె లేకుండా యిస్తాను కాపరంవుండు. కష్టపడు. బాగుపడు. అంతేగాని నౌకరీ యిప్పించమని నన్ను వేపకు. నీముఖంలో లక్ష్మీవిహారానికి తగిన తేజస్సు వుంది. నౌకరీలో ప్రవేశించి దాన్ని ధూళిధూసరితం చేసేసికోకు. లే. కాలం గడిచిపోతోంది. త్వరపడు. ఇన్ని చెప్పినా యింకా నీకు నౌకరీమీద వ్యామోహం తగ్గకపోతే వెళ్ళిపో. నా యెదుట నుంచోకు."